సాక్షి
ప్రకాశం
గురువారం । 5 । జూన్ । 2025



కూటమి నేతల చీకటి దందా

మద్దిపాడు మండలంలోని గుండ్లకమ్మ పరీవాహక గ్రామాల్లో ఇసుక అక్రమంగా తరలించి సొమ్ము కూటమి నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. -12లో..



బీఎస్ఎఫ్ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతిచెందిన పాకలకు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ ప్రదీప్ కుమార్ అంత్యక్రియలు బుధవారం నిర్వహించారు. -12లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39 /29

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

జాళ్లపాలెం బాధిత మహిళలకు సజ్జల పరామర్శ



సజ్జలతో ఫోన్‌లో మాట్లాడుతున్న చంద్రమ్మ

కొండపి: సీసీ ఫుటేజీ కోసం ప్రకాశం జిల్లా మర్రిపూడి ఎస్సై రమేష్‌బాబు దుకాణంలోని మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనలో బాధిత మహిళలు చంద్రమ్మ, ఆదిలక్ష్మిలను వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి బుధవారం ఫోన్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా ఘటన వివరాలను బాధిత మహిళలు సజ్జల రామకృష్ణారెడ్డికి వివరించారు. సీసీ ఫుటేజీ కోసం లోపలికి వెళుతున్న ఎస్సైను మా అన్న వచ్చిన తరువాత రావాలని చెప్పామని, కానీ ఎస్సై మాత్రం ఇంట్లోకి దౌర్జన్యంగా వచ్చి మమ్మల్ని నెట్టివేశారని తెలిపారు. ఆ విషయంలో విధులకు ఆటంకం కలిగించామని మా పైనే కేసులు పెట్టారని తెలిపారు. సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పార్టీ మీకు అండగా ఉంటుందని, పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని, పార్టీ తరఫున న్యాయ పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటన విషయమై కోర్టులో ప్రైవేట్ కేసు వేసి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని తెలిపి పరామర్శించారు. బాధితులను పరామర్శించిన వారిలో మాజీ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్ ఉన్నారు.

పడిపోతున్న లోగ్రేడ్ ధరలు

కొండపి: లో గ్రేడ్ పొగాకు ధరలు రోజు రోజుకు దిగజారుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలం ప్రారంభంలో కనిష్ట ధర రూ.260 ఉండగా ఐదో రౌండ్ వచ్చే సరికి కనిష్ఠ ధర రూ.185కి పడిపోయింది. రోజు రోజుకు ధరలు తగ్గించడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలానికి తీసుకువచ్చిన బేళ్లలో రోజుకు వందకు పైగా బేళ్లను వ్యాపారులు తిరస్కరిస్తున్నారు. పొగాకు బోర్డ్ అధికారులు బయ్యర్లతో సంప్రదింపులు చేసి ఎక్కువ ధరకు పొగాకును కొనుగోలు చేయాలని రైతుల తరఫున మాట్లాడి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుకుంటున్నారు. అధికారులు మొక్కుబడిగా వేలం కేంద్రాలకు పరిశీలనకు వచ్చి వెళుతున్నారే తప్ప రైతుల గోడు ఆలకించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం జరిగిన వేలంలో కనిష్ఠ ధర రూ.185 పలికింది. క్లస్టర్ పరిధిలోని పెరిదేపి, ముప్పరాజుపాలెం, అనకర్లపూడి, మిట్టపాలెం గ్రామాలకు చెందిన రైతులు 646 బేళ్లను తీసుకురాగా 462 బేళ్లను కొనుగోలు చేసి 184 బేళ్లను తిరస్కరించారు. వేలంలో 18 కంపెనీలు పాల్గొన్నాయి.

6 నుంచి డీఎస్సీ పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఒంగోలు సబర్బన్: జిల్లాలో 2025 మెగా డీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు స్థానిక ప్రకాశం భవన్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం పరీక్షల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 6వ తేదీ నుంచి రెండు షిఫ్టుల్లో ఈ నెల 30వ తేదీ వరకు మెగా డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. జిల్లాలో ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) ద్వారా ఈ కింది తెలిపిన ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి సెషన్ ఉదయం గం.9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం గం.2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. ఒంగోలులో ఆరు కేంద్రాలు, మార్కాపురంలో రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒంగోలులో పేస్ ఇంజినీరింగ్ కాలేజీ, రైజ్ ఇంజినీరింగ్ కాలేజీల్లో రెండు సెంటర్లు, క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ, నేషనల్ కౌన్సిల్ ఫర్ ద సెర్చ్ సోషల్ యాక్షన్ ఇండియాలో, బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్‌లో, మార్కాపురంలోని డాక్టర్ శామ్యూల్ జార్జ్ ఇంజినీరింగ్ కాలేజీలో, మార్కాపురం దేవరాజుగట్టు వద్ద ఉన్న కృష్ణ చైతన్య ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో సదరు ఆన్‌లైన్ పరీక్షకు (సీబీటీ) హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష సమయానికి గంటన్నర ముందుగా పరీక్ష కేంద్రానికి హాజరుకావాల్సి ఉంటుందన్నారు. హాల్ టిక్కెట్స్‌పై ఫొటో లేని అభ్యర్థులు తాజా ఫొటోగ్రాఫ్, సరైన గుర్తింపు కార్డుతో పరీక్షకు అనుమతిస్తారన్నారు. నామినల్ రోల్స్‌లో అభ్యర్థి పేరు/తండ్రి పేరు/లింగం వంటి చిన్న స్పెల్లింగ్ తప్పులను మార్చుకోవడానికి అభ్యర్థులు టెట్ పరీక్ష కేంద్రంలోని డిపార్ట్‌మెంటల్ అధికారులను సంప్రదించి మార్చుకోవచ్చన్నారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్, మంగళగిరిలో కమాండ్ కంట్రోల్ అన్ని పరీక్ష రోజుల్లో ఉదయం 7:30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పని చేస్తుందని చెప్పారు. ఒంగోలు డీఈఓ కార్యాలయంలో ఏపీ మెగా డీఎస్సీ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారని చెప్పారు. ఏమైనా సమస్యలుంటే శివ కుమార్, అసిస్టెంట్ కమిషనర్, పరీక్షల విభాగం వారి మొబైల్ ఫోన్ నెం.8125264606 ను సంప్రదించవచ్చన్నారు.



యర్రగొండపాలెంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



దర్శిలో నిరసన ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



కనిగిరిలో భారీ నిరసన ర్యాలీ

వెన్నుపోటుపై కదంతొక్కి..



ఒంగోలులో వెన్నుపోటు దినం ప్లకార్డును ప్రదర్శిస్తున్న విద్యార్థి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ఎన్నికలప్పుడు అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తుంగలోకి తొక్కి ప్రజలను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్‌పై జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు రణభేరి మోగించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు బుధవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు నిర్వహించారు.

సూపర్ సిక్స్ అంటూ మహిళలకు, యువతకు, విద్యార్థులకు, రైతులకు పలు హామీలు ఇచ్చి ఏడాది కాలంగా వాటిని అమలు చేయకుండా నయవంచనకు పాల్పడ్డారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



దర్శి: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

దద్దరిల్లిన దర్శి

వీడియో కోసం క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయండి

సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడిచిందంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన నినాదాలతో దర్శి పట్టణం దద్దరిల్లిపోయింది. ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ జరిగింది. బస్టాండ్ సెంటరులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధికారంలోకి వస్తే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని, రైతుకు పెట్టుబడి సాయం రూ.20 వేలు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.18 వేలు. మహిళలకు ఉచిత బస్సు అంటూ హామీలు ఇచ్చి మోసం చేశారని ధ్వజమెత్తారు. బాబు వస్తే భవిష్యత్తు గ్యారంటీ అని ప్రజలకు భవిష్యత్తు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఎన్ని విపత్కర సంఘటనలు ఎదురైనా ఇచ్చినమాట తప్పకుండా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలను సైతం నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు.

కిక్కిరిసిన కనిగిరి

ప్రజలు చేయి.. చేయి.. కలిపి.. గళం విప్పి చంద్రబాబు ఏడాది పాలనకు వ్యతిరేకంగా నినదించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి వేలాదిగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలతో కనిగిరి పట్టణం కిక్కిరిసి పోయింది. పామూరు రోడ్డులో ప్రారంభమైన ర్యాలీ చర్చి సెంటర్, చెప్పుల బజార్, ఎమ్మెస్సార్ రోడ్డు, శ్రీనివాస మహల్ సెంటర్, వైఎస్సార్ రోడ్డు, పార్క్ మీదుగా ఆర్డీఓ ఆఫీసుకు చేరుకుంది. ప్రజలకు చేసిన నమ్మక ద్రోహానికి, వెన్నుపోటుకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ప్రజలతో కలిసి ప్రజా ఉద్యమంలా పోరాటం సాగిస్తోందని ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విమర్శించారు. జీవితంలో జగన్ మోహన్‌రెడ్డిని తప్ప మరెవ్వరినీ ఇక ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. జగనన్న ఒక్కడే మాట ఇస్తే.. మాట మీద నిలబడతాడు.. మాట, ప్రాణం ఒక్కటిగా పాలన చేస్తాడనే అభిప్రాయానికి ప్రజలు వచ్చారని చెప్పారు. జగన్‌ను వదులుకుని తప్పు చేశాం.. భవిష్యత్తులో ఇక ఏనాడూ తప్పు చేయమని ప్రజలు ఆలోచించుకునే పరిస్థితిని సర్కార్ తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఈ సడించుకుంటున్నారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు.



కనిగిరిలో: ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కనిగిరి ఇన్‌చార్జ్ దద్దాల



కొండపిలో నిరసన ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

పోలీసులకు బెదరక..

ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన వెన్నుపోటు దినానికి కొండపి పోలీసులు అడ్డంకులు సృష్టించినా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు బెదరక ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులకు అనుమతి లేదని, వాటితో ర్యాలీ నిర్వహిస్తే కేసులు పెడతామంటూ పోలీసులు బెదిరించినా బెదరలేదు. కొండపి బస్టాండ్ సమీపంలోని శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయంలో పూజలు నిర్వహించి అక్కడ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్ విమర్శించారు. హామీల అమలుపై ప్రశ్నించే గొంతులను రెడ్ బుక్ కుట్రలతో నొక్కేస్తున్నారన్నారని ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా పరిగణించి వెంటాడి వేటాడి హత్యలు, హత్యాయత్నాలు దాడులతో భీతావహ వాతావరణం సృష్టిస్తున్నారన్నారని ధ్వజమెత్తారు. కొండపి మండలంలో పెద్దకళ్లగుంట సర్పంచ్ పై దాడులు అక్రమ కేసులు, పెట్లూరు గ్రామంలోని ఎస్సీలను రెచ్చగొట్టి పట్టా భూమిని ఆక్రమించి కట్టడాలు నిర్మించడం రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగమేనన్నారు.

పురంలో పోటెత్తిన నిరసన:

ఎన్నికలప్పుడు మార్కాపురాన్ని జిల్లా చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వెన్నుపోటు పొడిచారని, మెడికల్ కళాశాలకు మంగళం పాడేసి పేదలకు మెడికల్ విద్యతోపాటు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందకుండా చేశారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాలకు చెందిన ప్రజలు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పట్టణంలోని పాత బస్టాండు, రీడింగు రూము సెంటరు, కంభం సెంటరు, కోర్టు సెంటరు మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ అధికారులు ఏక పక్ష ధోరణితో వ్యవహరిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను వేధించడం మానుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు హెచ్చరించారు. ఆక్రమణల తొలగింపు పేరుతో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చేందుకు కూటమి పార్టీలు సూపర్ సిక్స్ అంటూ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు.

గిద్దలూరులో ఎగసిన ప్రజా గళం:

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ గిద్దలూరులో ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన గళం వినిపించారు. వెన్నుపోటు దినం సందర్భంగా నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో గిద్దలూరు బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో రాష్ట్ర ప్రజలను కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేసిందన్నారు. కేవలం వైఎస్సార్సీపీ నాయకులను టార్గెట్ చేసుకుని పాలన సాగించడం తప్ప ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన మొత్తం అప్పులో 44 శాతం అప్పుని ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం చేసిందన్నారు.

వెన్నుపోటుపై ఒంగోలులో పెల్లుబికిన ప్రజాగ్రహం:

అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఏ ఒక్క హామీనీ అమలు చేయకుండా అవినీతి, కక్షసాధింపు చర్యలతో పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి నిరసనగా ఒంగోలులో పెద్ద ఎత్తున ప్రజాగ్రహం పెల్లుబికింది. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలో వివిధ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం నశించాలంటూ నినదించారు. స్థానిక అంబేడ్కర్ భవన్ నుంచి ర్యాలీగా బయలుదేరి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకొని ఏఓకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు మాట్లాడుతూ కూటమి నాయకులు గంపగుత్తగా వచ్చి అలవిగానీ హామీలు చెప్పి ప్రజలను మోసం చేసి ఒక్క పథకానికి కూడా అమలు చేయకుండా ఏడాది పాలన పూర్తి చేసి అబద్ధాలు చెబుతూ నెట్టుకొస్తున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాల అమలు ఏమైందని ప్రశ్నించారు. ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతి లేకపోగా ఎక్సైజ్‌లో పనిచేస్తున్న 20 వేల మంది సిబ్బందిని, రేషన్ వాహనాల డ్రైవర్లు 9 వేల మందిని తొలగించి వెన్నుపోటు పొడిచారన్నారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ సూపర్‌సిక్స్ కే వెన్నుపోటు పొడిచిన చరిత్ర చంద్రబాబుదేనన్నారు. ప్రతి వ్యక్తికి, ప్రతి కుటుంబాన్ని వెన్నుపోటు పొడవడం నీకు సహజమైపోయిందని విమర్శించారు. ఏపీ ఎన్‌జీఓల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ ఇస్తానని చెప్పి మోసగించారన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయగా, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు.



యర్రగొండపాలెంలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

కదంతొక్కిన యర్రగొండపాలెం

వీడియో కోసం క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయండి

కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ యర్రగొండపాలెంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గిరిజనులు కదం తొక్కారు. ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుచెబుతున్నా బ్యానర్లు, పార్టీ జెండాలు, ప్ల కార్డులు పట్టుకొని దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేసుకుంటూ వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై మొరపెట్టుకున్నారు. సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలతో ప్రజలకు నమ్మించి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడించిందని, ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. చంద్రబాబుకు గద్దె దిగే కాలం వచ్చిందని, ప్రజలను నిత్యం మోసం, దగా చేయడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఒక్క పథకం కూడా అమలు చేయకుండా జగనన్న ఆధ్వర్యంలో ఇచ్చిన పథకాల డబ్బు దాదాపు రూ.2.75 లక్షల కోట్లు, డీబీటీ, నాన్ డీబీటీ కింద సంవత్సరానికి రూ.60 వేల కోట్ల డబ్బులు ఇప్పుడు ఏమయ్యాయని, అవి ఎవరి జేబులోకి వెళ్లాయని ఆయన ప్రశ్నించారు. ఈ డబ్బంతా బాబుగారి బినామి గ్యాంగ్‌కు చేరిందని ఆరోపించారు. మిర్చి రైతులు దగా పడ్డారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో క్వింటా ధర రూ.24 వేల నుంచి రూ.8 వేలకు పడిపోయిందని, పత్తిని సగానికి కొనే దిక్కులేదని, పొగాకుకు ధర లేక ఆ బేళ్లను రైతులు ఇళ్లల్లో పెట్టుకున్నారని, చివరికి కోకో రైతులను కూడా రోడ్డున పడేశారని విమర్శించారు.

ఎస్ఎన్‌పాడులో వెల్లువెత్తిన నిరసన:

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వందలాది మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ప్రజలు కదలి వచ్చి సంతనూతలపాడులో నిరసన ర్యాలీ నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీల డప్పు కొట్టి.. అధికారంలోకి వచ్చాక సామాన్యులు, పేదల పొట్టకొట్టారని చంద్రబాబు తీరును విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏడాది లోనే అమలు చేసిన నవరత్నాల పథకాలైన వైఎస్సార్ రైతు భరోసా, సున్నా వడ్డీ పంట రుణాలు, వైఎస్సార్ ఉచిత పంటబీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, జగనన్న తోడు, వైఎస్సార్ ఆసరా ఇంకా ఎన్నెన్నో బృహత్తర సంక్షేమ కార్యక్రమాలను అధికారంలోకి వచ్చాక పక్కన పెట్టిన చంద్రబాబు తాను హామీ ఇచ్చిన ఒక్క పథకమూ అమలు చేయలేదని విమర్శించారు.



సంతనూతలపాడులో నిరసన ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున



మార్కాపురంలో నిరసన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



ఒంగోలులో ర్యాలీలో పాల్గొన్న చుండూరి రవిబాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి తదితరులు



గిద్దలూరులో నిరసన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతి చెందిన నాగేశ్వరరావు

కొమరోలు: ఓ శుభకార్యానికి డెకరేషన్ లైట్లు ఏర్పాటు చేయడానికి వెళ్లిన ఎలక్ట్రీషియన్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కొమరోలు మండలంలోని ఓబులాపురం గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. మండలంలోని చింతలపల్లె గ్రామానికి చెందిన పిట్టల నాగేశ్వరరావు(40) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఓబులాపురం గ్రామంలో ఓ శుభకార్యానికి డెకరేషన్ లైట్లు వేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని స్థానిక ఎస్సై నాగరాజు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


మృతి చెందిన నబీరసూల్(ఫైల్)

పెద్దదోర్నాల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరులో జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం రాత్రి మృతి చెందాడు. వివరాలు.. పెద్దదోర్నాల మండల కేంద్రంలోని గిరిజన కార్పొరేషన్ వీధిలో నివసించే నబీరసూల్ మే 30వ తేదీన తన బైక్‌పై వెళ్తుండగా రోడ్డుపై పంది అడ్డురావడంతో అదుపుతప్పి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన యువకుడిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందినట్లు బంధువులు పేర్కొన్నారు. మృతుడు నబీ రసూల్‌కు భార్య కౌసర్‌తోపాటు ఓ కుమార్తె ఉన్నారు. భార్య ప్రస్తుతం గర్భంతో ఉందని బంధువులు తెలిపారు. నబీరసూల్ మృతితో తల్లిదండ్రులు నాసర్‌వలి, మాభున్నీ గుండెలవిసేలా రోదించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడు అనుమానాస్పద మృతి


మృతి చెందిన వెంకట్రావు

మద్దిపూడి: ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రమైన మద్దిపూడికి చెందిన పడిదపు వెంకట్రావు(24) పొక్లెయిన్ ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో వెంకట్రావు చిత్తూరు జిల్లాకు చెందిన పొక్లెయిన్‌ను బాడుగకు తీసుకుని తిప్పుతున్నాడు. ఈ నెల 2వ తేదీన ఒంగోలు రైల్వే స్టేషన్ సమీపంలో తీవ్ర రక్తగాయాలతో వెంకట్రావు పడి ఉండటాన్ని స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. పోలీసుల ద్వారా సమాచారం తెలుసుకున్న బంధువులు బుధవారం ఆస్పత్రికి చేరుకున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ వెంకట్రావు మృతి చెందాడు. వెంకట్రావు శరీరంపై తీవ్రగాయాలు ఉండటంతో ప్రమాదవశాత్తు గాయపడ్డాడా? లేదా ఎవరైన దాడికి పాల్పడ్డారా? అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు మృతి


గుర్తు తెలియని యువకుని మృతదేహం

సింగరాయకొండ: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు(35) మృతి చెందిన సంఘటన బుధవారం సింగరాయకొండ–ఉలవపాడు స్టేషన్ల మధ్య నెల్లూరు వైపు వెళ్లే లైనుపై చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మృతుడి శరీరంపై తెలుపు రంగు చారలు గల లైట్ పింక్ కలర్ హాఫ్ హ్యాండ్ టీషర్టు, లైట్ గ్రీన్ జీన్స్ ప్యాంట్ ఉన్నాయి. కుడి కాలి తొడ కింది భాగాన పుట్టుమచ్చ ఉంది. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఆచూకీ తెలిసిన వారు 9440627647కు సమాచారం అందించాలని ఒంగోలు ఆర్పీ ఎస్సై కె.మధుసూదనరావు విజ్ఞప్తి చేశారు.

కూటమి నేతల చీకటి దందా

గుండ్లకమ్మ పరివాహక గ్రామాల్లో అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు ఇసుక తవ్వకాలు

- యథేచ్ఛగా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న కూటమి నాయకులు
- వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నా అధికారుల మౌనం
- అక్రమార్కులను నిలువరించలేక తలపట్టుకుంటున్న అధికారులు


గుండ్లకమ్మ రిజర్వాయర్ దిగువ భాగంలో ఇసుక అక్రమంగా తవ్వుతున్న జేసీబీ

మద్దిపాడు: ఇసుక ఉచితం అంటూ కూటమి ప్రభుత్వం ఓ వైపు ఊదరగొడుతుండగా.. ఆ పార్టీల నాయకులు మాత్రం ఇసుకను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. అధికార పార్టీ ముఖ్య నేతల అండతో ఇసుక దందా సాగిస్తుండటంతో స్థానిక పోలీస్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మద్దిపాడు మండలంలోని గుండ్లకమ్మ నదీ పరివాహక ప్రాంతమైన అన్నంగి, మల్లవరం, కొలచనకోట, వెల్లంపల్లి, మద్దిపాడు, నందిపాడు. ఇనమనమెళ్లూరు తదితర గ్రామాల సమీపంలో ఇసుకను అక్రమంగా తవ్వి యథేచ్ఛగా తరలిస్తున్నారు. తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు జేసీబీలు, నాలుగైదు ట్రాక్టర్లతో గుండ్లకమ్మ నదిలో ఇసుక అక్రమంగా తవ్వి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. కాగా బుధవారం తెల్లవారే సమయంలో అన్నంగి పొలాల సమీపంలో జేసీబీ ట్రాక్టర్‌కు ఇసుక నింపుతూ కనిపించింది.


వెల్లంపల్లి వద్ద గుండ్లకమ్మ నదీ పరివాహక ప్రాంతంలో ఏర్పడిన గోతులు

వాల్టా చట్టానికి తూట్లు

కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉండటంతో ఆ పార్టీల నాయకులు అధికారులను ఏమాత్రం ఖాతరు చేయడం లేదని తెలుస్తోంది. ఇసుక అక్రమార్కులపై దాడి చేసినా నిమిషాల వ్యవధిలోనే ఫోన్లు చేయిస్తుండటంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు అటువైపు కన్నెత్తి చూసేందుకు సాహసించడం లేదు. వాల్టా చట్టం ఒకటి ఉందన్న సంగతి మర్చిపోయిన కూటమి నాయకులు.. నీటి వనరులు ఉన్న చోట, జాతీయ రహదారి వెంట, వెల్లంపల్లి బ్రిడ్జి కింద జేసీబీతో ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. ఇనమనమెళ్లూరు గ్రామంలో కూడా ఇసుక భారీగా తరలిస్తున్నారని మండల కేంద్రానికి దూరంగా ఉండడంతో అధికారులు పటించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుండ్లకమ్మ నదీ పరివాహక ప్రాంతంలో కూటమి నాయకులు సాగిస్తున్న ఇసుక దందాకు అడ్డుకట్ట వేయకపోతే నీటికి విలవిల్లాడిపోతామని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గుండ్లకమ్మలో ఇసుక అక్రమార్కులను కట్టడి చేయాలని కోరుతున్నారు. ఇసుక దందాపై స్థానిక తహసీల్దార్ నారాయణరెడ్డిని వివరణ కోరగా.. 'ఎటువంటి పరిస్థితుల్లోనూ ఇసుక అక్రమ రవాణాను సహించేది లేదు. అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామ'ని చెప్పారు.

కొనకనమిట్ల ఎస్సైగా ప్రభాకర్‌రెడ్డి


ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్‌రెడ్డి

కొనకనమిట్ల: కొనకనమిట్ల ఎస్సైగా జి.ప్రభాకర్‌రెడ్డి బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఒంగోలులో పనిచేస్తున్న ఆయన బదిలీపై కొనకనమిట్లలో నియమితులయ్యారు. నూతన ఎస్సై ఏఎస్సై ముల్లా సాహెబ్, స్టేషన్ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కాగా ఇప్పటి వరకు ఎస్సైగా విధులు నిర్వర్తించిన టి.రాజ్‌కుమార్ అంకిత భావంతో పనిచేయక పోవడం, స్టేషన్‌లో రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం, పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారికి అందుబాటులో లేకపోవడం తదితర ఆరోపణల నేపథ్యంలో వీఆర్‌కు బదిలీ అయ్యారు.

చౌటుప్పల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు
- బస్సు డ్రైవర్, మహిళా ప్రయాణికురాలు మృతి
- మరో 18 మందికి తీవ్ర గాయాలు


మృతి చెందిన బస్సు డ్రైవర్ కొండల్‌రావు(ఫైల్)


ప్రయాణికురాలు గోవిందమ్మ(ఫైల్)


ధ్వంసమైన ప్రైవేట్ ట్రావెల్ బస్సు ముందు భాగం

చౌటుప్పల్ రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామ స్టేజీ సమీపంలో హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో బస్సు డ్రైవర్‌తోపాటు ఓ ప్రయాణికురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా కందుకూరు నుంచి శివాంజలి ప్రైవేట్ ట్రావెల్ బస్సు 34 మంది ప్రయాణికులతో మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామ సమీపంలోకి వచ్చే సరికి జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న ఓ ట్రాలీ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం చిర్రికూరపాడు గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ కొండల్‌రావు(42) క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. డ్రైవర్ వెనుక సీటులో కూర్చున్న ప్రకాశం జిల్లా పొన్నులూరు మండలం పరుచూరివారిపాలెం గ్రామానికి చెందిన దండిబోయిన గోవిందమ్మ(47)కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలు గోవిందమ్మకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారిద్దరితో కలిసి హైదరాబాద్‌లో బంధువుల ఇంటి వద్ద ఫంక్షన్ ఉండడంతో కుందుకూరు నుంచి బస్సులో వెళ్తోంది.

డ్రైవర్ నిద్రమత్తే కారణం

ప్రమాద సమయంలో బస్సులో 34 మంది ఉండగా అందులో 18 మందికి గాయాలయ్యాయి. వీరిలో మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామానికి చెందిన పోకూరు భుజంగరావు, చీమకుర్తి మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన పులి సన్ని, సుజాత నగర్‌కు చెందిన యనమల మమత, కొత్తపట్నం మండలం పల్లెపాలెం గ్రామానికి చెందిన నాయుడు వెంకయ్య, నాయుడు రజని ఉన్నారు. చికిత్స నిమిత్తం క్షతగాత్రుల్లో కొందరిని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రి, మరికొంత మందిని హైదరాబాద్‌లోని ఉస్మానియా, హయత్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ కొండల్‌రావు, ప్రయాణికురాలు గోవిందమ్మ మృతదేహాలకు చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించారు. మృతురాలు గోవిందమ్మ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. ప్రమాద సమయంలో బస్సు డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నాడని ప్రాథమికంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

వల్నరబుల్ చిల్డ్రన్‌పై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా


మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మార్కాపురం: వల్నరబుల్ చిల్డ్రన్(దుర్బలమైన) కుటుంబ స్థితిగతులపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి వివరాలు సేకరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. బుధవారం మార్కాపురం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో బంగారు బాల్యంపై ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వల్నరబుల్ చిల్డ్రన్ కుటుంబ అవసరాలను గుర్తించి ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద రాచర్ల మండలాన్ని ఎంపిక చేసి 360 మంది పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. వీరిలో కొందరికి మూడు చక్రాల కుర్చీలు అవసరమని గుర్తించి అందజేశామన్నారు. వల్నరబుల్ చిల్డ్రన్‌కు అవసరమైన ఇల్లు, ఆధార్, రేషన్‌కార్డు మంజూరు, స్కూల్లో చేర్పించడం తదితర అవసరాలు ప్రభుత్వ పరంగా తీర్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ యాప్‌పై పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకుని పేద, బలహీన పిల్లల కుటుంబ స్థితిగతుల అవసరాలను నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, డీసీపీఓ దినేష్‌కుమార్, బంగారు బాల్యం నోడల్ అధికారి గిరిధర్ శర్మ, సార్ప్ ప్రతినిధి సునీల్, స్థానిక ఐసీడీఎస్, విద్యాశాఖ, మెడికల్ అధికారులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

పట్టణంలోని 12వ వార్డులో సచివాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ఆధార్ సీడింగ్ ప్రక్రియను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కొత్తగా మంజూరైన ఆధార్‌కార్డును లబ్ధిదారులకు అందజేశారు. కలెక్టర్ వెంట కమిషనర్ నారాయణ, తహసీల్దార్ చిరంజీవి, ఇన్‌చార్జి ఎంపీడీఓ భాగ్యవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణ, బుజ్జి, ఎస్సీఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు బూదాల గురవయ్య, లూకా తదితరులు ఉన్నారు.

ఉర్దూ పోస్టులు కొనసాగించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉర్దూ సొసైటీ సభ్యులు

మార్కాపురం టౌన్: జిల్లాలో తొలగించిన 46 ఉర్దూ పోస్టులను తిరిగి కొనసాగించాలని కోరుతూ కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఉర్దూ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ వహీద్‌ఖాన్ వినతిపత్రం అందజేశారు. బుధవారం పట్టణంలోని మెప్మా కార్యాలయం వద్ద కలెక్టర్‌ను కలిసి ఉర్దూ పోస్టుల తొలగింపు విషయమై మాట్లాడారు. ఉర్దూ పోస్టులను తొలగించడం వల్ల పాఠశాలల్లో సబ్జెక్ట్ బోధించేవారు లేక ఉర్దూ విద్యార్థులు చదువుకు దూరమవుతారని వివరించారు. మైనార్టీ విద్యార్థులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇతర జిల్లాల్లో అదనంగా 50 ఉర్దూ పోస్టులు అవసరమని, జిల్లాలో 46 పోస్టులను తొలగించడం అన్యాయమన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ఉర్దూ పోస్టులను కొనసాగించేందుకు సహకారం అందించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఉర్దూ డెవలప్‌మెంట్ సొసైటీ నాయకులు సబ్దార్ అలీబేగ్, అబ్దుల్ రవూఫ్, అష్రఫ్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎఫ్ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

- పాకలలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు


ప్రదీప్‌కుమార్(ఫైల్)


శ్మశానానికి ఊరేగింపుగా జవాన్ భౌతికకాయం


అంత్యక్రియల్లో పాల్గొన్న బీఎస్‌ఎఫ్ జవాన్లు

సింగరాయకొండ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పాకలకు చెందిన బీఎస్‌ఎఫ్ జవాన్ పాండూరి ప్రదీప్‌కుమార్ అలియాస్ సన్నీ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. గత నెలలో పాకిస్తాన్‌పై భారత్ ప్రెసిసన్ స్ట్రయిక్ చేపట్టిన తర్వాత ప్రదీప్‌కుమార్ సెలవుపై స్వగ్రామమైన సింగరాయకొండ మండలంలోని పాకల వచ్చారు. ఈ క్రమంలో తన తమ్ముడు అతిల్‌తో కలిసి మోటారుసైకిల్‌పై ఒంగోలుకు వెళ్తుండగా మార్గమధ్యంలో ప్రమాదానికి గురయ్యారు. తీవ్రంగా గాయపడిన ఆయన ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. బుధవారం పాకలలో బంధుమిత్రులు అశ్రునయనాల మధ్య ప్రదీప్‌కుమార్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు. ప్రదీప్‌కుమార్ భౌతికకాయానికి చిత్తూరు జిల్లా కలికిరి బీఎస్‌ఎఫ్–53 బెటాలియన్‌కు చెందిన 11 మంది జవాన్లు గన్ సెల్యూట్ చేసి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా ప్రదీప్‌కుమార్‌కు ఆరేళ్ల క్రితం వివాహమైంది. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కూటమి వైఫల్యాలపై ప్రజా పోరాటం

- సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వై.రవీంద్రబాబు



మాట్లాడుతున్న రవీంద్రబాబు

కనిగిరిరూరల్: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, వైఫల్యాలపై పార్టీ శ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వై.రవీంద్రబాబు పిలుపునిచ్చారు. కనిగిరిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్ధపు హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలు సంపాదనే ధ్యేయంగా ఇసుక, ప్రభుత్వ, అసైన్డ్ భూములను దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కులం, మతం పేరుతో నీచ రాజకీయాలు చేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఖరికి నిరసనగా గ్రామ స్థాయి నుంచి ప్రజా ఉద్యమాలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. ఈనెల 21, 22న దర్శిలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు వజ్రాల సుబ్బారావు, ఎస్‌కే మౌలాలి, పందిటి మోహన్,జీపీ రామారావు, పోతుల ప్రభాకర్, పాలపర్తి మస్తాన్‌రావు, పుట్టా సుబ్బారావు, ఖాశింపీరా, సయ్యద్ మౌలాలి(ఆర్టీ), ఎస్‌డీ ఖాదర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌పై పోలీస్ జులుం!


తెగిపోయిన గోల్డ్‌చైన్

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆర్మీ సైనికుడిపై రాచర్ల ఎస్సైతో సహా పోలీసు కానిస్టేబుళ్లు దాడి చేసిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. దీనిపై బాధితుడు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు చేసిన ఫిర్యాదు పత్రాలు బుధవారం సోషల్ మీడియా గ్రూపుల్లో చక్కర్లు కొట్టాయి. ఇటీవల రాష్ట్రంలో పలుచోట్ల పోలీసులు ప్రవర్తిస్తున్న తీరు వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో.. ఆర్మీ ఉద్యోగి రాచర్ల ఎస్సైపై పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. అందిన వివరాల మేరకు.. రాచర్లకు చెందిన జవాన్ మల్లెబోయిన వినోద్‌కుమార్ జె.పుల్లలచెరువు సమీపంలోని నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయం వద్దకు పాదయాత్రగా వెళ్లేందుకు అనుమతి కోసం నాలుగు రోజుల క్రితం రాచర్ల పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఏఎస్సైతో మాట్లాడుతున్న క్రమంలో ఎస్సై పి.కోటేశ్వరరావు వెనుక నుంచి మెడ పట్టుకుని దాడి చేశారని, అదే సమయంలో స్టేషన్‌లోని 8 మంది కానిస్టేబుళ్లు దాడి చేయడంతో గాయాలై, చొక్కా సైతం చిరిగిపోయిందని, బంగారు చైన్ రెండు ముక్కలైందని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో జవాన్ పేర్కొన్నారు. ఆర్మీ ఐడీ కార్డు జిరాక్స్ ఇవ్వనందుకు అరెస్టు చేస్తున్నామని చెప్పి రాత్రి 8 గంటల తర్వాత జడ్జి గారి ఇంటికి తీసుకెళ్లారని, జడ్జి ఆదేశాలతో స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారని అర్జీలో వివరించాడు. పోలీసులు తీవ్రంగా కొట్టడంతో మెడ, గుండె నొప్పి రావడంతో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి ఒంగోలు జీజీహెచ్‌కు వెళ్లి చికిత్స చేయించుకున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. జవాన్ ఆరోపణలపై రాచర్ల ఎస్సైని వివరణ కోరగా.. వినోద్‌కుమార్‌పై నాలుగు కేసులు ఉన్నాయని, ఓ కేసులో అరెస్టు చేసి, స్టేషన్ బెయిల్‌పై వదిలేశామని చెప్పారు.

నీటికుంటలో పడి బాలుడు మృతి


బాలుడి మృతదేహం వద్ద కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు

యర్రగొండపాలెం: నీటి కుంటలో పడి బాలుడు మృతిచెందిన ఘటన బుధవారం మండలంలోని అమానుగుడిపాడు ఎస్సీకాలనీలో జరిగింది. కాలనీకి చెందిన పల్లెపోగు సింహాద్రి (13) తన ఇంటి సమీపంలో ఉన్న నీటి కుంట వద్దకు వెళ్లాడు. ఆ కుంటలో దిగడంతో ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందాడు. కుమారుడి మృతితో బాలుడి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు.